

# ఓపిక

ఎస్. మోహనహరి

"దీని ధైర్యం పాడుగాను! సైకిల్ మీదున్న చెట్టంత కుర్రాడి చొక్కా పట్టుకుని చెడామడా చెంపలు వాయించేస్తోంది! సిగ్గులేకపోతే సరి. ఆడపిల్లకి ఉండాల్సిన లక్షణాలు ఒక్కటంటే ఒక్కటుంటే కదా దీనికి?"

వెన్నెల్లో చిన్ని చిన్న కుర్రాళ్ళతో చెడుగుడు ఆడుతుంటే వయసొచ్చిన ఏ కుర్రాడైనా ఎగతాళి చేస్తాడు - మరి.

"చిన్న కుర్రాళ్ళతో ఏం ఆట ఆడతావు. మనిద్దరం ఆడుకుందామా?" అన్నాడట. ఆ మాట విని మరో ఆడ పిల్లయితే సిగ్గుతో చచ్చిపోయేది. కానీ ఇదట్లా కాదు. పూనకం వచ్చినదాన్లా వాణ్ణి పట్టుకుని వాయించింది.

ఏమిటో! మా కాలం ఆడ పిల్లలం తలెత్తి నడిచే వాళ్లమా? నోరిప్పి మాట్లాడే వాళ్లమా?

ఈ పిల్లని నేను వచ్చినప్పటి నుంచే గమనిస్తున్నాను.

నేనంటే తల్లిని, ఓర్చుకోగల్ను.

కానీ, నా కోడలు ముందే మా అబ్బాయి ప్రక్కన కూర్చుని పరాచికలాడటం, ఒళ్ళు రాసుకుంటూ, తొడల మీద కొట్టుకుంటూ మాట్లాడుతుంటే నాకు విడ్డూరంగా ఉంది. మరో ప్రక్క అరికాలి మంట నెత్తికెక్కుతోంది.

ఈ పిల్లకి మరీ అంత చనువు ఇవ్వొద్దని కోడలిని హెచ్చరించాను. నా మాట వింటేనా?

"అత్తయ్యా! శిల్ప చాలా మంచి పిల్ల. అమాయకురాలు. మనసులో కల్మషం లేని పిల్ల." అని నవ్వి మాట మార్చేస్తుంది.

పిల్లట పిల్ల!! పెళ్ళయితే ఇద్దరు పిల్లల తల్లి అయ్యేది. దానికి తోడు దాని మాటలు ముద్దు ముద్దుగా ఉంటాయట. అందుకని దాన్ని ముద్దుగా "చిలకా!" అని పిలుస్తున్నారట. ఛీఛీ... దాన్ని చూస్తే నా ఒళ్ళంతా అసహ్యంతో కంపరం పుడుతోంది.

నేను వచ్చిన రోజే గమనించాను యీ మాయల మారి చిలక సంగతి.

తుఫానులా ఇంట్లోకి వస్తే ఎవరో అనుకున్నాను.

"అక్కా! మా ఇంటికి స్నేహితులొచ్చారు. మడత మంచం, రెండు కుర్చీలు తీసుకెళ్తున్నాను." అంటూ జవాబు కూడా వినిపించుకోకుండా తీసుకెళ్ళిపోయింది.

ఇంకో రోజయితే వంటింట్లోకి సరాసరి చెప్పులతో దూరి "అక్కా! మా ఇంట్లో కూరేమీ లేదు. వంకాయ కూర తీసుకెళ్తున్నాను" అనేసి గిన్నె నిండా కూరేసుకుని వెళ్ళిపోయింది.

ఏమో? బాబూ నాకు మాత్రం ఆ పిల్ల బుద్ధి నచ్చడం లేదు. అయినా మన బంగారం బాగుండాలి గానీ బయటి వాళ్ళ గురించి అనుకుంటే లాభమేముంది?

పదే పదే కోడలిని హెచ్చరించాను.

మళ్ళీ అదే చిర్నవ్వు! అదే సమాధానం!

"అత్తయ్యా! చిలకని మీరు అపార్థం చేసుకుంటున్నారు. అది అల్లరి పిల్లలా కనిపిస్తుందే గానీ దాని మనసు వెన్న. నన్ను ఒక్క పని చేయనీవదు. చూస్తున్నారుగా? కూరగాయల దగ్గర్నుంచీ వంట గ్యాస్, కరెంట్ బిల్లు వరకు అన్నీ పనులు చేసి పెడుతోంది. చూడండీ.... వద్దన్నా బట్టలు ఇస్త్రీ చేసి పెడ్తాంది. యీ అపార్ట్‌మెంట్ బ్రతుకులో ఇలాంటి మంచి పిల్ల వెదికినా దొరకదు."

"అదేనమ్మా నేన్చెప్పేది. ఇలాంటి నెరజాణలు ముందు మచ్చిక చేసుకుంటారు. ఆ తర్వాత ఏకులా ఉండి మేకై కూర్చుంటారు. ఎందుకైనా మంచిది. నువ్వు కాస్త జాగ్రత్తగా ఉండు. అబ్బాయిని బుట్టలో వేసుకున్నా వేసుకుంటుంది. ఆ తర్వాత నీ ఇష్టం...." అన్నాను.

"అదేం లేదత్తయ్యా! మీరు కొత్త. అందుకే మీకలా కనిపిస్తోంది. ఆయన ఆఫీసుకెళ్ళాక నేను ఒంటరిగా ఉంటాను. నాకు తోడుగా ఉంటోంది."

నా గుండె గుభేలుమంది.

ఈ రోజుల్లో ఎలాంటి స్వార్థం లేకుండా స్నేహం చేసే పొరుగు వాళ్ళున్నారంటే నేనమ్మను గాక నమ్మను.

సందేహం లేదు. ఇదంతా ఎర్రగా, బుర్రగా ఉన్న మా అబ్బాయిని వల్లో వేసుకోడానికి చూస్తోందా చుప్పనాతి చిలక. అదేంటో చిలకట చిలక! అమాయకమైన ఆ పక్షి ఎక్కడా ఇదెక్కడా?

## ఆమె - ఈమె

చాలీ చాలని చింకి గుడ్డ వంటికి చుట్టుకుని
గుడ్డల్లేని పిల్లాడ్ని చంకనెత్తుకుని
అమ్మా-బాబూ! అంటూ ప్రతీ గుమ్మందగ్గరా
ప్రతీ షాపు ముందు - ప్రతీ మనిషి ముందు
చేయి చాచి అడుక్కుంటోంది ఆమె!?
దరిద్రం ఆమె సిగ్గుని దూరంగా నెట్టేస్తే
ఆకలి ఆమె అవయవ సంపదని అధిగమించింది!?
నడిరోడ్డు మీద ఇంచుమించు నగ్నంగా!
ఆమె అడుక్కుంటున్నా!
"ఛీ...ఛీ.." అని అసహ్యించుకునేవారే కాని -
అయిదు పైసలు ధర్మం వేసే వారు లేరు!
........................
పేరు పొందిన పెద్ద క్లబ్బులో!
పెద్ద పెద్ద విద్యుద్దీపాల వెలుతుర్లులో!
ఆవింత కాంతుల మధ్య క్యాబరే నృత్యం చేస్తూ
అవయవాలన్నీ అందంగా వూపుతూ
అందరి దగ్గరా వయ్యారాలు పోతూ
పరువాల ప్రదర్శనకోసం
వలువల్ని ఒక్కొక్కటిగా వూడదీస్తోంది ఈమె!
తాగిన మైకంలో పెద్దమనుషులంతా
కైపెక్కిన కళ్ళతో 'ఈమె' మీద కనకవర్షం కురిపిస్తున్నారు!
అక్కడ నడిరోడ్డుమీద గుడ్డ కరువై.... ఆమె?!!
ఇక్కడ నలుగురి మధ్య గుడ్డ బరువై... ఈమె...?!!

**- శ్రీమతి న్యాయపతి కమలారాంజీ**


రాక్షసి బల్లిలా.

రహస్యంగా చిలక గురించి ఆరా తీశాను.

చిన్నప్పుడే తల్లిని మింగేసిందట! ఇది తండ్రికి రెండో కూతురు. అతనేదో ఆఫీసులో గుమాస్తా లాంటిదేదో ఉద్యోగం చేస్తున్నాడు. పెద్ద కూతురు పెళ్ళి చేసి అప్పుల పాలయ్యాడట! ఇదేమో డిగ్రీ చేస్తూ మానేసిందట. అందుకే ఇలా పొరుగు ఇంట్లో నుంచీ ఉప్పు, పప్పు వగైరాలు పట్టుకుపోతోంది.

నా కోడలు ఒఠి అమాయకురాలు, కాబట్టి దీని ఆటలు సాగుతున్నాయ్. అబ్బాయితో చనువుగా ఉంటుందంటే ఇహ సందేహం లేదు. ఏకంగా సవతిగా మారిపోయి ఇంట్లో తిష్ఠ వెయ్యాలని చూస్తోంది.

ఒకరోజు ఉన్నట్లుండి భరించలేని ఒళ్ళు నొప్పులతో జ్వరమొచ్చి మంచం పట్టాను. దానికి సందు దొరకాలిగానీ ఇట్టే దూరిపోతోంది. డాక్టరుని తీసుకొచ్చింది. నేనెంత వద్దన్నా నా కాళ్ళు ఒత్తుతూ



కూర్చుంది. ట్రైముకి మందులిచ్చింది. బలవంతంగా పళ్ళు తినిపించింది. పాలు త్రాగించింది.

ఒట్టి నాటకం!

పెద్దదాన్ని నా మనసుని గెలుచుకుంటే ఇహ అడ్డేముందీ? అంతా కుట్ర! నేనేం తక్కువ తెలివిగలదాన్నా? దాని ఆటలు నా దగ్గర సాగవని దానికి తెలీదు. ఇలాంటి వాళ్ళని నా జీవితంలో ఎందరినో చూశాను.

నా బాధంతా నా కొడుకూ కోడలు గురించే, నేనెంత జెప్పినా నా మాట వినిపించుకోరేమిటీ?

ఏదో నాలుగు రోజులుండి పోదామని వచ్చాను. కానీ అల్లరి పిల్ల నా కొడుకు సంసారాన్ని ఏం చేస్తుందో నని దిగులు పట్టుకుంది.

చెప్పాల్సిందంతా చెప్పాను నా మాట విననప్పుడు ఎవరు చేసుకున్న ఖర్మ వాళ్ళు అనుభవిస్తారు.

అందుకే బయల్దేరే ముందు దాని మొహం చూడ బుద్ధి కాలేదు. ట్రెయిన్ కదిలేటప్పుడు కోడలిని మళ్ళీ మళ్ళీ హెచ్చరించాను.

ఇంటికి తిరిగి వచ్చానన్న మాటే గానీ నా ఆలోచనలు ఆ రాక్షసి చిలక మీదే భ్రమిస్తున్నాయి.

పది రోజుల తర్వాత అబ్బాయి దగ్గిర నుంచీ ఉత్తరం వచ్చింది.

ఆత్రంగా విప్పి చదవసాగాను.

అమ్మా!

నమస్కారము. ఇక్కడ మేమందరము క్షేమంగా ఉన్నాము. నువ్వు కూడా క్షేమంగా ఉండాలని భగవంతున్ని ప్రార్థిస్తున్నాము.

ఒక ముఖ్య విషయం ఇక్కడ ఒక ప్రమాదం జరిగింది. భయపడకు ఇప్పుడంతా సర్దుకున్నాం క్షేమంగా ఉన్నాం.

నేను ఆఫీసుకి వెళ్ళినప్పుడు ఇంట్లో మీ కోడలు ఒంటరిగా ఉండటం గమనించి ఒక దొంగ పట్ట పగలే ఇంట్లోకి దూరాడు. కత్తి చూపించి నగలన్నీ మూటకట్టి ఇవ్వమని బెదిరించాడట.

ఈ అపార్ట్‌మెంట్ సంగతి నీకు తెలిసిందేగా! ఒకరి గురించి మరొకరు పట్టించుకోరు. ముఖ్యంగా టీవీల గోలతో ఎవరింట్లో వాళ్ళుంటారు. ఎవరొస్తున్నారో.... ఎవరు ఎక్కడి పోతున్నారో వాళ్ళు కనవసరం. ఒక చౌకీ దారుని పెట్టారు. వాడెప్పుడూ బెంచీ మీద పడుకుంటాడు. లేకుంటే డబ్బులు తీసుకుని మంచి నీళ్ళ కేన్లు తెస్తుంటాడు.

మీ కోడలు వణికిపోతూ నగలన్నీ తీసి అతని చేతిలో పెడుతుంటే మెరుపులా మన చిలక.... అదే.... మన శిల్ప ఇంట్లోకి వచ్చి పరిస్థితి గమనించింది.

మగాళ్ళు చేయలేని ధైర్యం చేసింది.

దొంగతో కలబడింది. చిలక దొంగను పట్టుకుని చితక బాదిందట! కానీ, ఆ గలాటలో దొంగ కత్తితో చిలక ఎడమ భుజంలో పొడిచాడు. అయినా వాణ్ని ఉడుములా పట్టుకుందట. పక్క పోర్షన్ వాళ్ళు వచ్చి దొంగని పట్టుకున్నారు చిలకని హాస్పిటల్‌కి తీసుకెళ్ళాం.

భగవంతుని దయవల్ల ఇప్పుడా పిల్ల క్షేమంగా ఉంది. కాకపోతే బలమైన గాయం వల్ల ఇంకా హాస్పిటల్లోనే ఉంది.

అమ్మా! చిలక అంత గాయపడినా.... అంత బాధలో కూడా కళ్ళు తెరచిన వెంటనే మీ కోడలి గురించి ఆందోళన పడింది. అలాంటి అమ్మాయి మా పక్కింట్లో ఉండటం మా అదృష్టం!

అమ్మా! చిలక ముఖ్యంగా మరో విషయంలో బాధపడుతోంది. నిన్ను మాటి మాటికి గుర్తు చేస్తోంది. నువ్వు వెళ్ళేటప్పుడు చెప్పి వెళ్ళలేదని ఏడుస్తోంది. అంతే....

నువ్వేమి కంగారు పడకు. ఇప్పుడు అందరూ క్షేమంగా ఉన్నారు.

మీ కొడుకు
మోహనరావు

ఉత్తరం చదివాక నాకిక ఉండబుద్ధి కాలేదు. ఉన్నఫళంగా బయల్దేరాను. కోడలు నవ్వుతూ ఆహ్వానించింది. చాలు. ఆ సంతోషంలో ఏడు కొండల వాడికి సహస్ర నమస్కారములు పెట్టుకున్నాను - మనసులో.

సాయంత్రం ముగ్గురం హాస్పిటల్‌కి వెళ్ళాము. నన్ను చూడగానే చిలక ఏడ్వడం మొదలెట్టింది. నేనా అమ్మాయి తల మీద చెయ్యేసి నిమురుతుంటే తను నా వొళ్ళో తల పెట్టి మరింత వెక్కి వెక్కి ఏడ్వడం మొదలెట్టింది.

ఆ పిల్ల అలా ఏడ్వడం నేను మొదటిసారిగా చూస్తున్నాను. ఆ ఏడుపులో ఎలాంటి కల్మషం, స్వార్థం, నటన కనిపించ లేదు.

చిలక ఒక దేవతలా కనిపిస్తోంది నాకప్పుడు!

"నేనూ, నా ప్రవర్తనంటే నీకిష్టం లేదు కదూ? అందుకే చెప్పకుండా వెళ్ళిపోయావు. అమ్మా! నేను నీ బిడ్డ లాంటిదాన్ని. నా మనసులో ఎలాంటి చెడు ఆలోచనలు లేవమ్మా.... నిజం.... చిన్నప్పటి నుంచీ ఇతరుల సుఖ దుఃఖాలలో పాలు పంచుకోవడం అలవాటయిపోయింది. నా వల్ల ఏదైనా పొరపాటైతే క్షమించు....."

చిలక కన్నీళ్ళతో నా చీర తడిసిపోతున్నది.

దుఃఖం ఆపుకోలేక పోయాను.

"అమ్మా! చిలకా! తప్పు చేసింది నువ్వు కాదు. నేను. నేను తప్పు చేశాను. నీ గురించి ఏమేమిటో ఊహించుకుని అపార్థం చేసుకున్నాను. చాలా పెద్ద పొరపాటు చేశాను. నన్ను మన్నించు తల్లీ నువ్వు ఒట్టి చిలకవు కావు. మా బంగారు చిలకవి..."

చిలకని నా గుండెలకి హత్తుకున్నాను.

అప్రయత్నంగా నా కళ్ళ నుంచే కన్నీరు బుగ్గల మీదనుంచీ జారుతుంటే "అదిగో నువ్వు కూడా ఏడుస్తున్నావ్.... పో..... నీతో మాట్లాడను." అంటున్న చిలకని చూస్తుంటే అది నిజంగా నా కన్న బిడ్డలా అనిపించింది.

దుఃఖంలో నవ్వు.... నవ్వులో దుఃఖం మిళితమైన ప్రేమానురాగాలు నా గుండె పొరలలోంచి ఉబికి ఉబికి వస్తుంటే చిలకని మరోసారి.... మనసారా.... నా గుండెలకి హత్తుకున్నాను. ❋

